# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 05-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **న్యూఢిల్లీలో 11వ రైసినా డైలాగ్‌ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.**

2. **రాష్ట్రంలో 4 కోట్ల రూపాయలతో కొత్త అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.**

3. **నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

4. **ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ ఓడరేవును ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్న మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి.**

=========================

న్యూఢిల్లీలో 11వ రైసినా డైలాగ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభిస్తారు. సాయంత్రం జరిగే ప్రారంభ సమావేశంలో ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ స్టబ్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేస్తారు. రైసినా డైలాగ్ అనేది 2016 నుండి ప్రతి సంవత్సరం న్యూఢిల్లీలో జరిగే ప్రధాన సమావేశం. ఈ రోజు నుంచి ఈ నెల 7వ తేదీ వరకు మూడు రోజుల జరిగే ఈ సమావేశంలో 110 దేశాల నుండి సుమారు రెండు వేల 700 మంది ప్రతినిధులు పాల్గొంటారు. భౌగోళిక రాజకీయాలు, భౌగోళిక–ఆర్థికశాస్త్రం అంశాలు అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనేందుకు రైసినా డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

-------------------------

రాష్ట్ర శాసన సభ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఉప శాసనసభాపతి రఘురామ కృష్ణంరాజు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను ప్రారంభించారు. శాసన సభలో రెండు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం –జేఎన్టీయూ సవరణ బిల్లును విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మోటారు వాహనాల పన్ను విధింపు బిల్లును ప్రవేశపెట్టనున్నారు. సభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇస్తున్నారు.

-------------------------

రాష్ట్రంలో 4 కోట్ల రూపాయలతో కొత్త అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపడుతున్నామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, సౌకర్యాల అంశంపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి శాసన సభలో సమాధానమిచ్చారు. అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. అంగన్వాడీ కార్యకర్తలకు 62 సంవత్సరాలు పూర్తయితే వారికి గ్రాట్యూటీని ఇస్తామని స్పష్టం చేశారు.. అంగన్వాడీల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శాసన సభలో తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా ఉప కేంద్రాలనిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 200 ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న ప్రతీ చోట విద్యుత్ ఉప కేంద్రాలను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

ఆన్ లైన్ మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదేశించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకు ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ బ్యాంకులు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా శిక్షణ పొందిన వారికి ఉపాధి లేదా వ్యాపార అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా రుణాలపై కళాశాలల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. సూర్యఘర్ పథకం కింద రాయితీ రుణాల మంజూరు వేగవంతం చేయాలని సూచించారు.

---------------------------

ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ ఓడరేవును ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రామాయపట్నం ఓడరేవు నిర్వాసితుల కోసం ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు మండలం కర్లపాలెంలో నిర్మించిన కాలనీని రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక యువతకు ఓడరేవు అనుబంధ రంగాలలో ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక నైపుణాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రామాయణపట్నం ఓడరేవు నిర్మాణం ద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధిగా కె. జయరాం ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏపీఎన్నార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల మంత్రి శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, అమెరికాలో చదువుకుంటున్న రాష్ట్ర విద్యార్థులు, అక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే .. వాటి పరిష్కారాలకు కృషి చేయడమే కాకుండా, రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించే విషయంలో విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

---------------------------

రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పరిశ్రమల శాఖా కార్యదర్శి ఎన్. యువరాజ్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ, ఆత్మ నిర్భర్ భారత్ కు కేంద్ర ప్రభుత్వ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం -PLI పథకం వంటివి దోహదం చేస్తాయని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రోత్సహించడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తుల మార్కెటింగ్ ను బలోపేతం చేయడం వంటివి PLI పథకం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.. ఇది కొత్త ఉద్యోగాలను కల్పించడంతో పాటు అన్ని స్థాయిలలోని ప్రరిశ్రమల విస్తరణకు అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు.

---------------------------

యువతలో నైపుణ్యాలను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అనంతపురం జిల్లా రెవిన్యూ అధికారి కేశవ నాయుడు తెలిపారు. అనంతపురంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవ నాయుడు మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కోసం ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమం యువతలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందిస్తాయని తెలిపారు.

---------------------------

విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తులకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రణాళికలను రూపొందించినట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అభివృద్ధిపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. 320 కోట్ల రూపాయల అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భక్తులకు శీఘ్ర దర్శనంతో పాటు రద్దీకి అనుగుణంగా సౌకర్యాలను మెరుగు పర్చాలని ఆదేశించారు. కుమ్మరి పాలెంలోని టీటీడీ స్థలంలో వసతి గృహాలు, ఏర్పాటును కూడా పరిశీలించాలని సూచించారు. పాలక మండలితో చర్చించి నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వం తరపున వాటిని ఆమోదింప చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు..

---------------------------

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ –ఏపీఎస్‌డీఎంఏ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఏడాది వేసవి తీవ్రత గతం కంటే ఎక్కువగా ఉంటుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నుంచి మే వరకు శ్రీకాకుళం, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, వైయస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిప్రాంతాలు మినహా మిగిలిన ప్రదేశాల్లో సాధారణం కంటే ఎక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు.

====================